**కథ**

# విశాల హృదయాలు

**పులిపాక కనకదుర్గ**

**సాయంత్రో మెత్తగా సాగిపోతోంది.**

**ఎటు చూసినా పచ్చటి చేలు. కంటికింపుగా, నిండుగా ఉన్నాయి.**

**"సార్ ఏదయినా ధాబా ముందు ఆపమంటారా?" డ్రైవింగ్ మీద నుంచి దృష్టి మరల్చకుండా అడిగేడు డ్రైవర్.**

**తల తిప్పి చూసేను.**

శ్రీమతి కళ్లు మూసుకుని వెనక్కి చేరగిలబడి ఉంది.

నందిని మటుకు విండోలోంచి బయటకు చూస్తోంది. తనని అలా చూస్తుంటే హృదయం కలుక్కుమంది. 'పిచ్చిపిల్లకు చిన్నవయసులోనే ఎంత కష్టమొచ్చింది.'

''ఏమ్మా నందిని ఎక్కడయినా టీ తాగుదామా?''

''మీ ఇష్టం నాన్నా'' నిర్లిప్తంగా చెప్పింది.

కారు ఒక మంచి ధాబా ముందు ఆగింది.

ధాబా ముందు వేసిన నులకమంచం మీద శ్రీమతి, నందిని కూర్చున్నారు. సమోసాలు, టీ ఆర్డరిచ్చి నేను కూడా నందిని పక్కన కూర్చున్నాను.

డ్రైవర్ కొద్ది దూరంలో ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. టీ ఒక్కటి చాలని చెప్పాడు. నందిని కూడా టీ తాగాననిపించి కారులోకి వెళ్లి కూర్చుంది.

''నందిని విషయంలో మనం పొరపాటు చేశామేమో అనిపిస్తోందండీ'' దిగులుగా అంటున్న శ్యామలను నెమ్మదిగా వారించి కారు వేపు అడుగులేశాను.

కారు మళ్లీ ఆత్రేయపురం వేపు సాగిపోవటం మొదలుపెట్టింది.

దారిలో తరుణ్ ఫోన్.

''ఏం డాడీ ఎక్కడి వరకూ వచ్చారు?'' అంటూ ఆరా తీసి చివరలో నాలుగు రోజులు ఆలస్యమైనా ఆత్రేయపురంలోనే ఉండి మొత్తం వ్యవహారాలన్నీ సెటిల్ చేసుకుని వచ్చెయ్యమని అప్పటికి ఏ వందోసారో చెప్పి ఫోన్ పెట్టేశాడు.

నేనో ప్రభుత్వ రంగ సంస్థలో ఉన్నతమైన పదవిలో రిటైర్ అయ్యాను. ఆత్రేయపురం రావటం శ్యామలకు సుతారామూ ఇష్టం లేదు. ''వద్దండి, కనీసం నందినినైనా హైదరాబాద్‌లోనే వదిలేసి వెళ్దాం. అక్కడ మీ అక్కయ్యగారింట్లో నందినిని ఏమైనా అంటే నేను భరించలేను'' అని వాపోయింది. కానీ నందినీని ఇంత పెద్దింట్లో ఒక్కత్తిని వదిలేసి వెళ్తే ఏం అఘాయిత్యం చేస్తుందోనన్న భయంతో మాతోటే తీసుకొచ్చాం.

ఆత్రేయపురం చేరేసరికి సాయంత్రం నాలుగయ్యింది.

దూరప్రయాణం అవ్వటం వల్లేమో ఎంత ఏసి కారులో ప్రయాణించినా అలసటగానే అనిపించింది.

మా కోసమే ఎదురుచూస్తున్నట్టున్నారు. కారు ఆగిన శబ్దం వినగానే అక్కా, బావా బయటకు వచ్చేశారు.

గానే.

''ఏమ్మా నందూ ఇక్కడ పల్లెటూర్లో పొద్దుపోవడం లేదా? రేపు నీవూ, రాధికా బావతో కలిసి మన పొలాలు తోటలు చూట్టానికి వెళ్లండి. మీకు మంచి కాలక్షేపం'' స్తబ్దుగా ఉన్న నందినిని ఉద్దేశించి ప్రేమగా అంది అక్కయ్య.

''ఇది పల్లెటూరు అంటే ఎవరు నమ్ముతారక్కయ్యా? ఆత్రేయపురం చాలా మారిపోయింది''

''అవును విశ్వం ఇప్పుడిది పల్లెటూరు కాదు చిన్నపాటి టౌను. ఇక్కడ దొరకనిది లేదనుకో'' బావ కూడా నాతో ఏకీభవించేడు.

బావ నాతో కబుర్లు చెప్తుంటే అక్కయ్య చకచకా వంట పూర్తి చేసింది. మాటవరసకయినా సాయం చేస్తానని శ్యామల ప్రవర్తన మొదటిసారిగా నాకు చిన్నతనమనిపించింది.

ఎక్కడి నుంచి వచ్చేశాడో సూర్య అయితే వద్దని వారిస్తున్నా వినక కారులోంచి మా లగేజీ గుంజుకుని లోపల పెట్టాడు.

అక్కయ్య అయితే మరీను నందినిని పొదివిపట్టుకుని ''ఏమ్మా ఈ అత్తయ్య ఇంత కాలానికి గుర్తొచ్చిందా?'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది.

అంత ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంటారని ఊహించలేదేమో క్షణకాలం తెల్లబోయిన శ్యామల వెంటనే సర్దుకుంది.

ఫ్రెషప్ అయిన వెంటనే ''రండి మావయ్యా బయట అరుగు మీద కుర్చీలున్నాయి. కాఫీ అక్కడ తీసుకోండి!' అంటూ దగ్గరుండి తీసుకెళ్లేడు సూర్య.

చిక్కటి, ఫ్రెష్ పాలతో చేసిన ఫిల్టర్ కాఫీ రుచి అద్భుతంగా ఉంది.

అక్కయ్యా వాళ్లది విశాలమైన లోగిలి. ఎత్తయిన అరుగులు, ద్వారబంధాలతో కళగా ఉంది. పెరడంతా రకరకాల కూరగాయల మొక్కలు, పూలమొక్కలతో నందనవనంలా ఉంది. అక్కయ్యని మా ఊరివాడే అయిన చిన్నప్పటి నుంచి ఎరిగిన భద్రం మేష్టారుగారి అబ్బాయికే ఇచ్చి చేశారు. అప్పట్లో అక్కయ్యకు కొన్ని దూరపు సంబంధాలు వచ్చినా ససేమిరా అని ఎరిగిన సంబంధమే చేశారు. బావ కూడా ఇక్కడే టీచరుగా చేస్తున్నాడు. ఒక రకంగా తొందరపడి నేనే వి.ఆర్.ఎస్. తీసుకున్నాను ఇంకా ఏడెనిమిదేళ్ల సర్వీసు ఉండగానే.

అక్కయ్య చేతి కమ్మటి భోజనం కడుపార తిని వచ్చేసరికి సూర్య వసారాలో మా అందరికీ పడకలు సిద్ధం చేశాడు. విశాలమైన నవారుమంచాల మీద మెత్తటి పరుపులు, వాటి మీద వేసిన తెల్లటి మల్లెపూవుల్లాంటి ఇస్త్రీ చేసిన బెడ్‌షీట్లతో చాలా సౌకర్యంగా అనిపించింది. చెరువు మీద నుంచి వచ్చే చల్లటిగాలిలో ప్రాణానికి చాలా హాయిగా ఉంది.

ఇహ అక్కా-బావల అన్యోన్యత చూస్తుంటే ముచ్చటేసింది. నాకు తెలిసి ఇన్నేళ్ల వైవాహిక జీవితంలో వారి మధ్య ఏ చిన్న పొరపొచ్చమూ లేదు. పట్టుపట్టి ఎరిగిన సంబంధమే చేసినా ఆనాటి నాన్న ముందుచూపు ఈనాడు అబ్బురమనిపించింది.

అదే ముందు చూపు నాకుండి ఉన్నట్లయితే చిన్నారి నందిని జీవితం ఇలా అయ్యుండేది కాదన్న వేదన కూడా తీవ్రమైంది.

నందిని వివాహ విషయంలో స్టేటస్‌కే పెద్దపీట వేశాం. అమెరికాలో స్థిరపడ్డ ఇంజనీర్‌తో నందిని వివాహం నిర్ణయించేము. వరుడి మంచితనం, అత్తగారి స్వభావం మాకంత ప్రాధాన్యత కలిగిన అంశాలుగా అగుపించలేదు. అందుకు భారీగా మూల్యం చెల్లించవలసి వచ్చింది. చిత్రహింసలు పెట్టే శాడిస్టు భర్త, అగ్నికి ఆజ్యమయ్యే అత్తగార్లతో నందిని వైవాహిక జీవితం నరకప్రాయమైంది. వివాహం మూన్నాళ్ల ముచ్చటయ్యి తెగతెంపులయ్యింది. చట్టబద్ధమైన విడాకులయ్యింది.

చలాకీగా ఉండే నందిని జీవచ్ఛవమయ్యింది. నందిని పెదాల మీద చిరునవ్వు, మా జీవితాల్లో ఆనందం ఒకేసారి ఆవిరయ్యాయి.



మా భావోద్వేగాల్ని గమనించేరేమో అక్కయ్యా, బావ చిన్ననాటి ఊసులతో మమ్మల్ని డైవర్ట్ చేశారు. మధ్యమధ్యలో నందినిని కూడా ఇన్వాల్వ్ చేశారు.

వచ్చిన దగ్గర్నించి నందిని వైవాహిక జీవితం గురించి పల్లెత్తు మాట కూడా అడగని వారి సంస్కారానికి మనసులోనే జోహారులర్పించాను.

ఇంత చక్కటి బాంధవ్యానికి దూరమైనందుకు నాకు తెలియకుండానే నాలో విచారం మొదలైంది. సహజ వైరమో ఏమో గానీ మొదటి నుంచి శ్యామలకు అక్కయ్య పొడ గిట్టేది కాదు. దానికి తగ్గట్టు సిటీలో మంచి ఉద్యోగం, ఎప్పుడో పాతికేళ్ల క్రితం చౌకగా కొన్న ఫ్లాట్ పాష్ ఏరియాగా మారి నన్ను ధనికవర్గంలో చేర్చటంతో ఆర్థిక అంతరాలు కూడా పెరిగి అక్కయ్య దూరపుబంధువుగా స్థిరపడింది.

''పెంచుకోవలసిన బాంధవ్యాన్ని తుంచుకున్నామని ఇప్పుడు వగచి ఏం లాభం?''

ఆహ్లాదకరమైన వాతావరణం, ఆత్మీయుల సమక్షం మనసును బుజ్జగించటంతో నాకు తెలియకుండా నిద్రలోకి జారిపోయాను.

ఆరు గంటలకు మెలకువ వచ్చినప్పుడు ఎంతో ఫ్రెష్‌గా అనిపించింది. నా తరువాత నిద్దురలేచిన నందిని కూడా కొద్ది లేటుగా ఉండటం గమనించేను.

అక్కయ్య బ్రేక్‌ఫాస్ట్‌గా చేసిన ఆవిరి కుడుమును, ఉలవచారు, కారప్పొడిలతో కలిపి తింటుంటే ఏ స్టార్ హోటలు అయినా దిగదుడుపే అనిపించింది.

పదవుతుండగా రాధిక వచ్చింది. రాధికను కూడా బావ ఆ ఊరి మోతుబరుల ఇంటికే ఇచ్చాడు. ఆదరించడంలో అక్కయ్యకు కూతురనిపించుకుంది. నందినిని మురిపించి, మరిపించి తోటలు చూట్టానికి ఒప్పించింది. సూర్య కూడా మేమొచ్చామని సెలవు పెట్టేడుట.

''పెద్దిరెడ్డిగారికి అర్జెంటుగా పని పడి ఊరెళ్లారుట. నాలుగు రోజుల్లో వస్తారుట'' నందినికి ఊరు చూపించడానికి బయలుదేరే ముందు సూర్య నా దగ్గరకు వచ్చి చెప్పేడు.

ఆత్రేయపురంలో నాలుగెకరాల మాగాణి, ఎకరం మామిడితోట, ఇల్లు నాన్ననించి నాకు సంక్రమించినవి. వాటిని బేరం పెట్టింది పెద్దిరెడ్డికే. ఆ వ్యవహారాలన్నీ సెటిల్‌మెంట్ చేసేందుకే మేమిప్పుడు ఆత్రేయపురం వచ్చింది. వచ్చిన డబ్బుతో నందినికి మంచి ఫ్లాటు కొనివ్వాలని ఆలోచన. అస్తవ్యస్తమైన నందిని జీవితానికి కొంతలో కొంత ఆధారమవుతుందని చిన్న ఆశ.

పెద్దిరెడ్డి ప్రస్తావన రాగానే అక్కయ్య కన్నులు చెమ్మగిల్లటం గమనించేను.

''విశ్వం ఇప్పుడు ఏమంత అవసరమొచ్చిందని ఆస్తులని బేరం పెట్టావు? నాన్న గుర్తుగా ఉంచుకోవచ్చుగా. ఇప్పటికిమల్లే వాటి బాగోగులు మేము చూస్తాం. ఇదివరకుమల్లే ఆ రాబడి నీ పేర బ్యాంకులో వేస్తాముగా'' ఆస్తులని కూడా అమ్మేస్తే మా మధ్య దూరం ఇంకా పెరుగుతుందన్న భయం స్పష్టంగా కనిపించింది అక్కయ్య మాటల్లో.

వయసులో తన కంటే చిన్నవాడినని అక్కయ్యకు నా మీద ఉన్న ప్రేమ నాకు కొత్త కాదు. ఏనాడూ చిటికెడు పసుపు కుంకుమలు పిలిచి పెట్టకపోయినా తగ్గని ఆ ఆప్యాయతకు నేను తగననిపించింది.

''నాన్నా మన తోటలో మామిడిపళ్లు ఎంత తియ్యగా ఉన్నాయో తెలుసా? కడుపు నిండా పళ్లు తిని, కొబ్బరి నీళ్లు తాగితే ఆకలే వెయ్యలేదు. ఇక్కడ మనకో ఇల్లు కూడా ఉందిట కదా? బావ చూపించేడు'' చాన్నాళ్ల తరువాత వినిపించిన నందిని పలుకులు చెవుల్లో అమృతం పోసినట్టనిపించింది.

నందిని వెనకాలే సూర్య, రాధిక నవ్వుతూ నిలబడున్నారు.

నాలుగు రోజుల్లో వస్తాడన్న పెద్దిరెడ్డి వియ్యంకుడికి సుస్తీ చేసిందని పదిహేను రోజుల తరువాత వచ్చేడు.

చిత్రంగా ఇక్కడకు వచ్చిన వారానికి డాక్టర్ దగ్గరకు వెళ్లి చెక్ చేయించుకుంటే బి.పి. నార్మల్‌గా ఉంది. శ్యామల కాళ్ల నొప్పులు కూడా కొద్దిగా తగ్గాయిట. ''ఇప్పుడొస్తున్న వ్యాధుల్లో తొంభై శాతం సిటీల్లో ఆహారపుటలవాట్ల వల్లనే. హాయిగా ఇక్కడే ఉండిపోండి. స్వచ్ఛమైన గాలి, ఏ టెన్షన్లు లేని లైఫ్‌స్టయిల్ వీటితో మందుల అవసరం కూడా లేకుండానే మీ బి.పి. నార్మల్‌గా ఉంటుంది'' నవ్వుతూ అన్నాడు డాక్టర్‌గారు.

ఎలా చెప్పినా ఆయన చెప్పింది అక్షరసత్యమని అర్థమయ్యింది.

శ్యామల కూడా ఒక విధంగా బాగా తేరుకుంది.

సిటీలో అయితే డబ్బిచ్చి కొని తెచ్చుకున్న కొరివి క్లబ్ మెంబర్‌షిప్. అక్కడే ఎప్పుడూ స్లీవ్‌లేసులు మాత్రమే ధరించే యాభై ఏళ్ల మిసెస్ షా, ఎవర్ యంగ్ అని భ్రమించే సుపర్ణ తదితరులు మాకు పరిచయం.

నందిని వివాహం ఛిద్రమయ్యేక ఒక్కొక్కరూ మాటలతో ఎంత హింసించేరని. ముఖ్యంగా శ్యామలని. తనయితే ఇటీవలి కాలంలో ఎవరిని కలవాలన్నా జంకుతోంది. ఇక్కడ తనక్కూడా హాయిగా ఉన్నట్టుంది ఎప్పుడు వెళ్దామని అడగటం లేదు. పైపెచ్చు అక్కయ్యతో స్నేహంగా మెలుగుతూ ఆ పనీ ఈ పనీ అందుకుంటోంది. అదీ మరింత సంతోషాన్నిచ్చింది.

పెద్దిరెడ్డి వచ్చేక లావాదేవీలన్నీ చూస్తున్న సూర్య వ్యవహారదక్షతకు, సమర్ధతకూ ముచ్చటేసింది. ఓ పక్కన ఉద్యోగం చేసుకుంటూ మరో పక్క గ్రూప్ వన్‌కు ప్రిపేర్ అవుతున్నాడు సూర్య. ఆణిముత్యాన్ని అందుబాటులో ఉంచుకుని కూడా విలువ తెలియక నా చిట్టితల్లిని కరినాగుకు ఇచ్చి కట్టబెట్టాను.

''విశ్వం మొత్తం వ్యవహారమంతా ఒక కొలిక్కి వచ్చింది. సూర్య బేరం మనకు లాభసాటిగానే సెటిల్ చేసేడు. మరి డాక్యుమెంట్స్ అవీ సిద్ధం చేయించమంటావా? ఏ విషయమూ బాగా ఆలోచించుకుని చెప్పు'' రాత్రి భోజనాల సమయంలో బావ చెప్పేడు.

ఎందుకో ఆ ప్రస్తావన సంతోషకరంగా అనిపించలేదు. సూర్య లిప్తకాలం నందినిని క్రీగంట గమనించి ఆశాభంగం చెందినవాడిలా చూపులు తిప్పేసుకున్నాడు.

''విశ్వం ఇప్పుడు ఏం తక్కువయ్యిందని సొంత ఊరిలో ఆస్తులను అమ్మకానికి పెట్టడం? ముందర నందిని భవిష్యత్తు గురించి ఆలోచించు. రోజులు మారాయి. జరిగినదంతా ఒక పీడకలనుకుని దానికి ఒక కొత్త జీవితాన్ని ఇవ్వాల్సిన బాధ్యత నీమీదుంది. మాకు నందిని వేరు, రాధిక వేరు కాదు. ఈ విషయంలో దాని కోసం ఏం చేయటానికయినా సిద్ధమే'' పక్కనే ఉన్న నందిని తల నిమురుతూ అంది అక్కయ్య.

ఆ రాత్రి ఎందుకో కంటికి కునుకు దూరమయ్యింది.

ఆత్రేయపురంతో ఋణం తీరిపోతోంది అన్న భావన ఎందుకనో సుతరామూ నచ్చటం లేదు. ఒక విధంగా నందిని జీవితం దెబ్బ తినటంతో కను విప్పయిందనే చెప్పాలి. ఎందుకొచ్చిన భేషజాలు? ధనదాహానికి, స్టాటస్ రేసులకూ అంతమెక్కడుంది? వాటివల్ల బావుకునేదేముంది? ఇక్కడికి వచ్చే ముందు మళ్లీ ఇక్కడికి రాకూడదనే వచ్చేము. కానీ, ఇక్కడ పదిహేను రోజుల ఉండేక ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది.

ఆత్మీయుల సమక్షంలో సేదదీరటం వల్ల ఏదో తెలియని నిశ్చింత. అందుకే పూర్వీకులు ముందర అంగబలం అన్నారు. అర్ధబలం ఆ తరువాతే.

అయినవారి అండతో నందిని జీవితానికి ఏదో ఒక దారి ఏర్పడుతుందన్న చిన్ని ఆశ తెలియకుండానే నాలో మొలకెత్తింది.

భవిష్యత్ ప్రణాళిక రూపొందించుకున్నాక మనసు తేలిక పడింది. మిగిలిన రాత్రంతా కంటి నిండా నిదురపోయేను.

★ ★ ★

ఆరు నెలలు గడిచిపోయేయి.

తరుణ్ భార్యతో హైదరాబాద్‌లోనే ఉండిపోయేడు. మేము మటుకు ఇక్కడి ఇంటికి చిన్న చిన్న మరమ్మతులు చేయించుకుని అందులోకి షిఫ్టయిపోయాం.

ఆస్తులని అమ్మకుండా ఇక్కడే సెటిలయిపోవాలన్న నా నిర్ణయానికి శ్యామల ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు.

నందినిలో నేను ఆశించినదాని కన్నా మంచి మార్పే కనిపించింది. సూర్యతో పాటు తను కూడా కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవుతోంది. మొదటి నుంచి సూర్యకు నందిని పట్ల ఉన్న ఆరాధన సుపరిచితమే కానీ ఇప్పుడు మటుకు దెబ్బతిన్న పావురాల పట్ల మానవత్వమున్న ఏ మనిషికయినా ఉండే కరుణేమో అని నా ఉద్దేశం.

శ్యామలకు కూడా నందినిని సూర్యకు ఇవ్వాలని ప్రగాఢమైన వాంఛ.

కానీ అక్కా బావల విశాలహృదయాన్ని అలుసుగా తీసుకుని అనువుగాని కోరికను కోరరాదన్న విజ్ఞతతో గమ్మున ఉండిపోయేం.

ఆ రోజు నందిని పుట్టిన రోజు.

కొత్త దుస్తులలో నా బంగారుతల్లి మేలిమి బంగారంలా, కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. నందిని పుట్టిన రోజు సందర్భంగా శ్యామల అక్కయ్య కుటుంబాన్ని, రాధిక అత్తింటి వారిని భోజనాలకు ఆహ్వానించింది.

ఇల్లంతా పండగలా, సందడిగా ఉంది.

ఎందుకో రాధిక పిలిస్తే బయటకు వెళ్లింది నందిని. దేని మీద కాలు వేసిందో జారిపడబోతున్న నందినిని సూర్య అక్కున చేర్చుకున్నాడు. సూర్య గుండెల మీద నందిని. కళ్లతో నవ్వుతున్న సూర్యని చూసి నందిని చెంపలు ఎరుపెక్కాయి.

బావామరదళ్ల వరసయిన సరసం ఓ సుందర దృశ్య కావ్యంలా గోచరిస్తుంటే నందిని పట్ల సూర్య ఆరాధన చెక్కు చెదరలేదని అవగతమైంది.

''ఏ తప్పూ చేయని నందిని గంగాజలమంత పవిత్రమైనది. మీ అంతట మీరే నందినిని సూర్యకు అడుగుతారని వేచి ఉన్నాం. కానీ మీ అపరాధ భావన, ఆత్మన్యూనత అర్థమయ్యి మేమే సూర్యకు నందినిని అడుగుతున్నామంటూ'' అక్కా బావలు తమకు రాధిక వేరు నందిని వేరు కాదన్న మాటను నిలబెట్టుకుని తమ విశాల హృదయాన్ని మరొక్కమారు చాటుకున్నారు.

## ఖాన్ కోసమే ఆ డాన్సు!

**కరీనాకపూర్ ఇకపై ఏడాదికి రెండు సినిమాల్ని మించి చేయకూడదని అనుకుంటోందిట. మంచి పేరు తీసుకొస్తాయనుకునే వేషాలే తప్ప వచ్చిన ప్రతి ఆఫర్నీ ఒప్పుకోదల్చుకోలేదు- అంటోంది కరీనా. మరి 'డాన్' సినిమాలో ఒక్క పాటకే ఎందుకు ఒప్పుకున్నారు? అది కూడా కాస్త సెక్సీగా వుంది కదా? అని అడిగితే- 'ఆ డాన్సు కేవలం షారుఖ్ ఖాన్ గురించే చేశాను. షారుఖ్‌పై నాకున్న అభిమానం అలాంటిది. అసలు ఆయనతో మంచి లవ్‌స్టోరీ వున్న సినిమా చేయాలని వుంది. ఆ కోరిక ఎప్పటికి తీరుతుందో?' అంటోంది కరీనా.**

